మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

గురువారం 5 మార్చి 2026 పేజీలు : 4






## పదో తరగతి హాల్ టికెట్లు విడుదల

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల హాల్ టికెట్లు గురువారం విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కె . వి . శ్రీనివాసులు Reddy తెలిపారు. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్, మనమిత్ర వాట్సాప్ సేవ, లీప్ యాప్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవ చ్చని సూచించారు.

వివరాలు 2లో..

## సూర్యలంక బీచ్‌ను గోవాకు పోటీగా అభివృద్ధి

### శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన



వివరాలు 2లో..

బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌ను గోవాకు పోటీగా నిలి చేలా అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చే యనున్నట్లు ముఖ్యమంత్రి .చంద్రబాబు నాయుడు శాసన సభలో తెలిపారు. రాష్ట్ర పర్యాటక విధానంలో భాగంగా బీచ్ టూరిజానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మౌలిక సదుపాయాలు, హోటల్ వసతులు, వినోద సదుపాయాలు ఏర్పాటు చేసి సూర్యలంకను దేశీయ, అంతర్జాతీయ పర్యాట కులను ఆకర్షించే ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.

- ✶సర్పంచుల పదవీకాలం ముగియనుండగా కీలక నిర్ణయం
- ✶ఎన్నికల కమిషనర్ నియామకం, రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు
- ✶ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల ద్వారా పంచాయతీ పాలన
- ✶త్వరలో ప్రభుత్వం నిర్ణయం..




# పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన

రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనుండటంతో ఆ తర్వాత పరిపాలన కొనసాగింపుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అవసరమయ్యాయి. ఎన్నికల నిర్వహణకు అవసరమైన కొత్త రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకం, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండటంతో తాత్కాలికంగా ప్రత్యేక అధికారులను నియమించే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. గ్రామస్థాయిలో అభివృద్ధి పనులు, పరిపాలనలో అంతరాయం లేకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు సూచిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కొన్ని నెలలపాటు ఈ విధానం కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.రాష్ట్రంలోని వేలాది గ్రామపంచాయతీల్లో ప్రస్తుతం కొనసాగుతున్న సర్పంచుల పాలనకు త్వరలో ముగింపు పలుకనుంది.

వివరాలు 2లో..

## ఐదు రేషన్ షాపులపై కేసులు నమోదు

జిల్లాలో రేషన్ పంపిణీ వ్యవస్థను కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా ఐదు చౌక ధరల దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు గుంటూరు జాయింట్ కలెక్టర్ అషుతోష్ శ్రీవస్తావా తెలిపారు. సరుకుల వ్యత్యాసాలు, అక్ర మ రవాణా వంటి ఉల్లంఘనలను గుర్తించిన నేపథ్యంలో చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.



రక్షణ న్యూస్ గుంటూరు

జిల్లాలో రేషన్ పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఐదు చౌక ధరల దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు.మార్చి నెల రేషన్ పంపిణీ సమయంలో పౌరసరఫరాల ఉప తహాశీల్దారులతో కలిసి జిల్లా పౌరసరఫరాల

మిగతా 2లో

## పెదకాకానిలో విషాదం..

### బెలూన్‌తో ఆడుకుంటూ చిన్నారి మృతి

గుంటూరు జిల్లా పెదకాకానిలో విషాద ఘటన చోటుచేసుకుంది. బెలూన్‌తో ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి శిరీష గొంతులో బెలూన్ అడ్డుపడటంతో అపస్మారక స్థితికి చేరి మృతి చెందింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించినప్పటికీ వైద్యులు పరీక్షించే సమయానికే చిన్నారి ప్రాణాలు కోల్పోయింది.

పెదకాకాని రక్షణ న్యూస్

గుంటూరు జిల్లా పెదకాకానిలో నాలుగేళ్ల చిన్నారి మృతితో విషాదం నెలకొంది. చిన్నారి శిరీష ఇంటి వద్ద బెలూన్‌తో ఆడుకుంటుండగా అది అకస్మాత్తుగా గొంతులో

మిగతా 2లో

## సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు.

- ◆ వైసీపీ కార్యకర్త అరెస్ట్
- ◆ తెనాలి రూరల్ పోలీసుల చర్య
- ◆ కోర్టు 14 రోజుల రిమాండ్





గుంటూరు జిల్లా తెనాలి పరిధిలో సోషల్ మీడి యాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో బాపట్లకు చెందిన వైసీపీ కార్యకర్త షేక్ సయ్యద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. టీడీపీ సోషల్ మీడియా కార్యకర్త జెట్టి రేణుక ఫిర్యాదు మేరకు తెనాలి రూరల్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు 2లో..

5-3-26 RAKSHANA_praja jyothi Medhak.qxd 3/5/2026 4:45 AM Page 2



## పదో తరగతి హాల్ టికెట్లు విడుదల

మొదటి పేజీ తరువాయి

**పల్నాడు రక్షణ న్యూస్ ప్రతినిధి**

అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం హాల్ టికెట్లు గురువారం విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కె.వి. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న ఎస్ఎస్సీ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ బెస్ ఏపీ ఆఫీసియల్ వెబ్సైటు ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు.అదేవిధంగా 'మనమిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009, అలాగే పాఠశాల విద్యాశాఖ లీప్ యాప్ ద్వారా కూడా హాల్ టికెట్లు పొందే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.ఇక ఎస్ఎస్సీ హాల్ టికెట్ల పంపిణీ, డౌన్‌లోడ్‌కు ఎలాంటి ప్రైవేట్ ఏజెన్సీకి లేదా థర్డ్ పార్టీ వెబ్‌సైట్లకు అనుమతి ఇవ్వలేదని అధికారులు స్పష్టం చేశారు. కాబట్టి అనధికారిక వెబ్‌సైట్ల ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు.

## సూర్యలంక బీచ్‌ను గోవాకు పోటీగా అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

**రక్షణ న్యూస్ బాపట్ల జిల్లా బ్యూరో**

రాష్ట్రంలో బీచ్ టూరిజాన్ని అభివృద్ధి చేసే దిశగా బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసనసభలో తెలిపారు. సూర్యలంక బీచ్‌ను గోవాతో పోటీ పడే స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. సూర్యలంకలో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయనున్నట్లు సీఎం తెలిపారు. బీచ్ ప్రాంతంలో రహదారులు, పార్కింగ్ సదుపాయాలు, పర్యాటకులకు వినోద కార్యక్రమాలు, రిసార్టులు, హోటల్ వసతులు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా రూపొందించిన టూరిజం పాలసీ ద్వారా ఇప్పటికే పెద్ద ఎత్తున పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెరగడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు.సూర్యలంక బీచ్ అభివృద్ధి ద్వారా బాపట్ల జిల్లా పర్యాటక రంగంలో కీలక కేంద్రంగా మారుతుందని, దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. బీచ్ టూరిజాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## పెదకాకానిలో విషాదం..

మొదటి పేజీ తరువాయి

ఇరుక్కుపోయింది. దీంతో చిన్నారి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది.ఈ ఘటన గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని గుంటూరులోని ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి (జీజీహెచ్)కు తరలించారు. అయితే వైద్యులు పరీక్షించే సమయానికే చిన్నారి ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. వైద్యులు చిన్నారి గొంతులో ఇరుక్కున్న బెలూన్‌ను బయటకు తీసి కృత్రిమ శ్వాస అందించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది.ఆడుకుంటూ ఉన్న చిన్నారి అనూహ్యంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.

# పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన

మొదటి పేజీ తరువాయి

**ఉమ్మడి జిల్లా గుంటూరు బ్యూరో..**

గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం వచ్చే నెల 2వ తేదీతో పూర్తవుతుంది. సాధారణంగా పదవీకాలం ముగియకముందే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై కొత్త ప్రజాప్రతినిధులు బాధ్యతలు స్వీకరించాల్సి ఉంటుంది. అయితే ఈసారి పరిస్థితులు భిన్నంగా ఉండటంతో వెంటనే ఎన్నికలు నిర్వహించడం కష్టంగా మారినట్లు తెలుస్తోంది.దీంతో గ్రామపంచాయతీల్లో పరిపాలన నిలిచిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం తాత్కాలికంగా ప్రత్యేక అధికారులను నియమించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ అధికారుల ద్వారా పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలన, ప్రభుత్వ పథకాల అమలు కొనసాగించాలనే ప్రణాళిక ఉన్నట్లు తెలుస్తోంది.గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో కీలకమైన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీ కాలం కూడా ఈ నెలాఖరుతో ముగియనుంది. ప్రస్తుత కమిషనర్ నీలం సాహ్ని పదవీ కాలం ముగిసిన తర్వాత కొత్త కమిషనర్ నియామకం జరగాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంటుంది.ఇక పంచాయతీ ఎన్నికల ముందు తప్పనిసరిగా చేపట్టాల్సిన రిజర్వేషన్ల ప్రక్రియ కూడా కీలక అంశంగా ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్ల కేటాయింపు వంటి అంశాలపై అధికారిక నిర్ణయాలు తీసుకుని వాటిని అమలు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున వెంటనే ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల ద్వారా పంచాయతీల పరిపాలన కొనసాగించడం సరైన మార్గమని అధికారులు సూచిస్తున్నట్లు సమాచారం. ప్రతిపాదన అమలులోకి వస్తే ప్రతి గ్రామపంచాయతీకి ఒక ప్రభుత్వ అధికారి బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. సాధారణంగా మండల స్థాయి లేదా జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించే అవకాశం ఉంటుంది.వారి ఆధ్వర్యంలో పంచాయతీల్లో శానిటేషన్, తాగునీటి సరఫరా, గ్రామాభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి కార్యక్రమాలు కొనసాగుతాయి. గ్రామపంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల ఆమోదం వంటి పరిపాలనా అంశాలు కూడా వారి పర్యవేక్షణలోనే జరుగుతాయి.అయితే ప్రజాప్రతినిధులు లేకుండా అధికారుల పాలన కొనసాగడం వల్ల గ్రామస్థాయిలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం తగ్గే అవకాశముందని కొంతమంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు పరిపాలనలో అంతరాయం లేకుండా ఉండేందుకు ఇది తాత్కాలికంగా అవసరమైన చర్య అని అధికారులు చెబుతున్నారు.గ్రామపంచాయతీ ఎన్నికలు సాధారణంగా గ్రామస్థాయిలో రాజకీయంగా అత్యంత ఉత్కంఠభరితంగా జరిగే ఎన్నికలుగా గుర్తింపు పొందాయి. సర్పంచ్ పదవి కోసం స్థానికంగా తీవ్ర పోటీ ఉండటం సాధారణం. ప్రస్తుతం సర్పంచుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇప్పటికే రాజకీయ చర్చలు మొదలయ్యాయి. అయితే ఎన్నికలు కొంతకాలం వాయిదా పడే అవకాశమున్నట్లు తెలుస్తుండటంతో అభ్యర్థులు, స్థానిక నాయకులు పరిస్థితిని ఆసక్తిగా గమనిస్తున్నారు.ప్రభుత్వం త్వరలోనే కొత్త ఎన్నికల కమిషనర్ నియామకం, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి గ్రామపంచాయతీ ఎన్నికలపై స్పష్టత ఇవ్వవచ్చని భావిస్తున్నారు. అప్పటివరకు ప్రత్యేక అధికారుల ద్వారా పంచాయతీ పాలన కొనసాగుతుందా అనే విషయంపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.

## ఐదు రేషన్ షాపులపై కేసులు నమోదు

మొదటి పేజీ తరువాయి

అధికారి రేషన్ షాపులను విస్తృతంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 244 రేషన్ షాపులను తనిఖీ చేసినట్లు వివరించారు. తనిఖీల్లో సరుకుల వ్యత్యాసాలు గుర్తించడంతో పెదకాకాని మండలంలో మూడు షాపులు, ఫిరంగిపురం మండలంలో ఒక షాపు, గుంటూరు నగరంలోని నల్లచెరువు ప్రాంతంలో ఒక రేషన్ షాపుపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.అలాగే కార్డుదారుల వద్ద నుంచి అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు రాత్రి వేళల్లో తరలిస్తున్న నాలుగు వాహనాలను పట్టుకుని వారిపై 6--ఏ కేసు, క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.రేషన్ బియ్యం ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాలతో కూడిన బలవర్ధక బియ్యం అని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్డుదారులు రేషన్ బియ్యాన్ని ఎవరికీ అమ్మకూడదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ డీలర్లు బియ్యానికి బదులుగా నగదు ఇవ్వడం వంటి అక్రమాలకు పాల్పడితే వారి డీలర్‌షిప్‌ను రద్దు చేసే వరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇక జిల్లాలో పలు వ్యాపార సంస్థలు గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గత నాలుగు నెలల్లో 21 వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేసి 112 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వాడటం నేరమని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

## సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు...

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల జిల్లా రక్షణ న్యూస్ ప్రతినిధి**

గుంటూరు జిల్లా తెనాలి రూరల్ పరిధిలో సోషల్ మీడియాలో అసభ్యకర, అసత్య పోస్టులు పెట్టిన ఘటనపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. బాపట్లకు చెందిన వైసీపీ కార్యకర్త షేక్ సయ్యద్‌ను అరెస్ట్ చేసినట్లు తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్ తెలిపారు.అంగలకుదురుకు చెందిన టీడీపీ నాయకురాలు జెట్టి రేణుకపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా ఎడిట్ చేసిన ఫోటోలు, అసత్య పోస్టులు పెట్టినట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు పేరుతో లింక్ చేస్తూ జెట్టి రేణుక ఉన్న కారు ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది విస్తృతంగా షేర్ అయినట్లు వెల్లడించారు.జెట్టి రేణుక ఫిర్యాదు చేయడంతో షేక్ సయ్యద్‌ను పోలీసులు వెతికారు. ఈ క్రమంలో అతడు పారిపోతుండగా నందివెలుగు జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.అయితే సయ్యద్‌పై గతంలో కూడా పలు కేసులు నమోదయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. 2024 సెప్టెంబర్--అక్టోబర్ నెలల్లో ముఖ్యమంత్రి చీ. చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , హోంమంత్రి వంగళపూడి అనిత లపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కేసుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని తెలిపారు.చింతలపూడి, బాపట్ల టౌన్, కొత్తపట్నం, పులివెందుల, విశాఖపట్నం, విజయవాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో అతనిపై కేసులు ఉన్నప్పటికీ ప్రవర్తనలో మార్పు లేకుండా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు, ఫోటో ఎడిటింగ్ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని అవసరమైతే రౌడీషీట్ కూడా తెరుస్తామని గుంటూరు జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేసింది.

# రెవెన్యూ అర్జీలకు ప్రత్యేక ప్రాధాన్యం

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లాల్లో 22ఎ కింద నమోదైన భూముల తొలగింపు అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి పాల్గొని జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న పీజీఆర్ఎస్ అర్జీలు, 22ఎ దరఖాస్తుల పరిష్కారం, మ్యుటేషన్లు, నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రీ సర్వే, రెవెన్యూ రికార్డులడిజిటలైజేషన్, ఇన్వెంటరీ అప్‌డేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ సంబంధిత అర్జీలను సత్వరమే పరిష్కరించేలా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు క్షేత్రస్థాయి అధికారులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో



కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కే ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

# మాతృ మరణాల నివారణ దిశగా

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లాలో మాతృ మరణాలు నివారించేందుకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది, వైద్యాధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్షా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో నమోదైన నాలుగు మాతృ మరణాలపై చికిత్స అందించిన వైద్యులు, ఆడిట్ కమిటీ సభ్యులు, మృతుల బంధువుల నుంచి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. వీటిలో రెండు మరణాలు నివారించగలిగినవిగా, మరో రెండు నివారించలేనివిగా నిపుణులు పేర్కొన్నట్లు తెలిపారు. నివారించగలిగిన కేసుల్లో జరిగిన లోపాలను గుర్తించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి గర్భిణికి మొదటి త్రైమాసికం నుంచే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. రిస్క్ ఉన్న గర్భిణులను అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసి సురక్షిత ప్రసవం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. శస్త్రచికిత్సలు నిర్వహించే ప్రతి ప్రైవేట్ ఆసుపత్రిలో ఐసీయూ, వెంటిలేటర్ సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిని ఆదేశించారు. గర్భిణులు అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి రావాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యాధికారులు



అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఎఫ్‌సీఎం ఇంజెక్షన్ విడుదల చేశారు. అధిక రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడే ఫెరిక్ కార్బాక్సీ మాల్టోస్ (ఎఫ్‌సీఎం) ఇంజెక్షన్‌ను కలెక్టర్ లాంఛనంగా విడుదల చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు రూ.2 వేల విలువ గల ఈ ఇంజెక్షన్‌ను అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్ఏ) కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. విజయలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, ప్రోగ్రాం ఆఫీసర్లు, కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల అభివృద్ధికి తోడ్పాటు.

గుంటూరు జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారుల అభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ డ్వాక్రా రుణాలను వ్యాపార అవసరాలకు మాత్రమే వినియోగించేలా పర్యవేక్షణ పెంచాలని సూచించారు. రుణాలను కుటుంబ అవసరాలకుమళ్లించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే బాలింతలు, బాలలకు అందజేసే పౌష్టికాహారం కుటుంబ సభ్యులందరూ వినియోగించకుండా, అర్హులకే అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశం



చారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు గ్రామ హెల్త్ కేర్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండలానికి రూ.90 లక్షల చొప్పున గ్రామాల్లో పన్ను వసూళ్లు చేపట్టాలని డీపీవోను ఆదేశించారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందితో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డీఆర్‌ఓ నారద ముని, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, ఐసీడీఎస్ పీడీ ఎం. ఉమాదేవి, డీపీవో వి. నాగేశ్వరరావు నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పెదకాకాని రైల్వే స్టేషన్లో దారుణం




**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లాలోని పెదకాకాని రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం చోటుచేసుకున్న దారుణ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు ఒక వ్యక్తిని అతి దారుణంగా గొంతు కోసి హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బుధవారం తెల్లవారుజామున రైల్వే స్టేషన్ ఆవరణలో రక్తపు మడుగులో పడి ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే, అతని పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. అతను రైల్వే ప్రయాణికుడా? స్థానికుడా? లేక ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తినా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. ఇక హత్య జరిగిన విధానం పై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగులు వ్యక్తిని స్టేషన్ ఆవరణలోనే హత్య చేశారా? లేక మరెక్కడైనా హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడికి తీసుకొచ్చి పడేశారా? అన్న అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ పరిశీలిస్తూ, అనుమానితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటనపై పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. ఈ దారుణ ఘటనతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. పోలీసులు త్వరితగతిన నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎస్సీ కమిషన్ తో విన్నకోట భేటీ

**బాపట్ల రక్షణ న్యూస్**



రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు గౌతమ్ రాజు, సీతారాం బుధవారం బాపట్ల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా బాపట్ల తహశీల్దార్ కార్యాలయంలో స్థానిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యటనలో భాగంగా అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు, జనసేన నాయకుడు విన్నకోట సురేష్ కమిషన్ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు మరియు గౌతమ బుద్ధుని విగ్రహం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బాపట్లకు విచ్చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. అట్టడుగు వర్గాలఅభ్యున్నతికి, రాజ్యాంగబద్ధ హక్కుల రక్షణకు కమిషన్ పెద్దపీట వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాపట్ల నియోజకవర్గ పరిధిలోని దళితుల సమస్యలను కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

# ప్రజా సౌకర్యాల పరిరక్షణ అధికారుల బాధ్యత




**చీరాల రక్షణ న్యూస్**

చీరాల మున్సిపల్ పరిధిలో నిర్మించిన పలు పబ్లిక్ టాయిలెట్లు సరైన నిర్వహణ లేక దుర్భర స్థితికి చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ సౌకర్యాలు ప్రస్తుతం శుభ్రత లోపంతో నిరుపయోగంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.ఆంధ్రరత్న రోడ్‌లోని పబ్లిక్ టాయిలెట్‌లో శుభ్రత లేకపోవడంతో పాటు నీటి సౌకర్యం లేక దుర్వాసనలు వ్యాపిస్తున్నాయి. ముక్కోన పార్క్ సెంటర్ సమీపంలోని టాయిలెట్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురై వినియోగానికి అనుకూలంగా లేకుండా ఉంది. ఎన్ఆర్పీఎం హైస్కూల్ పరిధిలోని టాయిలెట్లు కూడా సరైన మెయింటెనెన్స్ లేక అస్వచ్ఛంగా మారాయి. గర్ల్స్ హైస్కూల్ ప్రహరీ గోడ వద్ద నిర్మించిన టాయిలెట్‌లో నీటి సౌకర్యం లేక పూర్తిగా మూతపడిన పరిస్థితి నెలకొంది.ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి అన్ని టాయిలెట్లను శుభ్రపరచడంతో పాటు నీటి వసతి కల్పించి, రెగ్యులర్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పూర్తిగా పనికిరాని టాయిలెట్ల స్థానంలో కొత్త సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజాధనం వృధా కాకుండా మున్సిపల్ అధికారులు సమగ్ర నివేదిక సిద్ధం చేసి త్వరితగతిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# డీఈ సస్పెన్షన్ డిమాండ్ చేస్తున్న సచివాలయ సిబ్బంది



**చిలకలూరిపేట రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా చిలకలూరిపేట లో మున్సిపల్ డీఈ రహీం సచివాలయ సిబ్బందిపై అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణలతో వార్డు సచివాలయాల ఉద్యోగులు ఆందోళనకు దిగారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు.పల్నాడు జిల్లా సచివాలయాల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డీఈ రహీం ఒక సచివాలయ ఉద్యోగినిని ఫోన్‌లో అసభ్యకరంగా తిట్టారని ఆరోపిస్తూ, ఆయనపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.నిరసన ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని వినతిపత్రం సమర్పించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబును కలిసి డీఈపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. "డీఈ రహీం డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేశారు.సచివాలయ సిబ్బందిపై అవమానకర ప్రవర్తనను తాము ఖండిస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.

# అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష




**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాలో కొనసాగుతున్న జాతీయ రహదారి, రైల్వే ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని న్యూ వీసీ హాల్‌లో నిర్వహించిన వారాంత ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. సీఎండీఎఫ్ పరిధిలో నియోజకవర్గాల్లో చేపట్టిన కార్యక్రమాలపై అధికారులు వివరాలు సమర్పించారు.ప్రత్యేకంగా నేషనల్ హైవే పరిధిలోనిఒడరేవు--చిలకలూరిపేట రహదారి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. రహదారి వెంట నిర్మాణంలో ఉన్న వంతెనలు, ఆర్ఓబీలు, మైనర్, మేజర్ జంక్షన్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.కారంచేడు--పర్చూరు టోల్ గేట్ వద్ద రెండు రోజుల్లో టోల్ వసూళ్లు ప్రారంభించనున్నట్లు అధికారులు సమావేశంలో తెలిపారు. రహదారి పక్కన మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో కొనసాగుతున్న రైల్వే పనుల పురోగతిని కూడా సమీక్షించిన కలెక్టర్, నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి డీఈ అరుణ, సీపీఓ సాల్మన్ రాజు, కలెక్టర్ ఈవో మల్లికార్జున, భూ సేకరణ అధికారి శ్రీలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.


# పోలీసుల విస్తృత తనిఖీలు



**వేటపాలెం రక్షణ న్యూస్**

వేటపాలెం మండలంలోని కొనిజేటి నగర్ కాలనీలో పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ పర్యవేక్షణలో వేటపాలెం పరిధిలో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.చీరాల రూరల్ సీఐ, వేటపాలెం ఎస్సై మరియు చీరాల రూరల్ ఎస్సైతో పాటు పోలీసు సిబ్బంది కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని 16 మోటార్ సైకిళ్లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన వాహనాలను స్టేషన్‌కు తరలించి తదుపరి విచారణ చేపట్టారు.అదేవిధంగా మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మత్తు పదార్థాలు కలిగి ఉన్నవారిపై, విక్రయిస్తున్న వారిపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.ప్రజలు చట్టాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

# ఎమ్మెల్యేకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన వెల్లటూరు గ్రామస్తులు



**భట్టిప్రోలు రక్షణ న్యూస్**

భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన సుగాలి సంఘ సభ్యులు హోలీ పండుగను ఘనంగా నిర్వహించి అనంతరం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.వెల్లటూరు గ్రామంలో సుగాలి సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కేతావత్ రమేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బాణావతి బుద్ధ నాయక్, బాణావతి చంద్రమౌళి, భూక్య కృష్ణ, తేజావత్ చంద్రం తదితరులు మహిళలు, పిల్లలతో కలిసి హోలీ సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలో రంగులు చల్లుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా పండుగను నిర్వహించారు.అనంతరం గ్రామ దేవత శ్రీ కట్లమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. మొక్కుబడులు తీర్చుకుని గ్రామాభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.తదుపరి స్థానిక ఎమ్మెల్యే ఆనంద్ బాబు ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనంద్ బాబు కు గ్రామస్థులు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సుగాలి సంఘ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.